అదిగో- ఆతని చేతులలో, ఒకటి- ఉద్యాన వనంలో వికసించిన మల్లెపూవు యొక్క హిమ హారాన్ని ఒత్తిగిస్తోంది; రెండోది- భవిష్యత్తు యొక్క అంధకార రాజ్యంలోకి నిర్భయంగా దూరి ఉషాబాల చీరకొంగు పుచ్చుకొని లాగుతోంది.

అదిగో ఆతని కర్ణాలలో, ఒకటి- దుముకులు దుమికే ఝరులపాటులోని పాటలను వింటోంది; రెండోది- ఇంద్రదర్బారులో గంధర్వకిన్నరకింపురుషాంగనల ఆలాపనలను వింటోంది. అదిగో ఆతని కన్నులలో, ఒకటి- అతీతమైన హద్దులను అతిక్రమించి సృష్టియొక్క ప్రథమ ఉష యొక్క కెంపు వర్ణంతో తనలోని రంగును తులతూచుకుంటోంది; రెండోది- ప్రభాకరుని ప్రచండకిరణాలు కూడా దాగగల్గినంత విరివిగా వెల్లివిరిసిన నిబిడాంధకారాన్ని దొలుచుకు దొలుచుకు చూస్తోంది, ఏముందో లోపల అని.

అతను యెవరో ? ఎందుకు గుర్తుకువస్తాడు ? ఈనాటివరకూ ఈ విశాల ప్రపంచంలో ఎవ్వరు గుర్తించారు కవిని అతని కవిత్వాన్ని ఏమోయెప్పుడైనా గుర్తించారేమో కాస్త, గుర్తిస్తే.

'ఆ! ఆతనికి కవిత్వము వరప్రసాదము-' అంటుంది, ఎప్పుడైనా మహదానందం పొందిన సమయాలలో ప్రపంచం. అంటే-అదీ పొరపాటే. కవిత్వము భగవంతుని విశేషశిక్షలలో విపరీతశిక్ష. ఏ మహాపరాధం చేశాడో యెరుగడు కాని, ఈ మహాదండన మానవుడనుభవిస్తాడు. ఇతరుల లోకాలను తీసుకోలేడు సరి కదా; తన లోకాన్ని తానే ఉంచుకోలేడు. అన్నివిధాలుగా వీడు దండనార్హుడు, వీణ్ణి వంచించాలి అన్న నిర్ణయానికి వచ్చిననాడే విధాత విధిస్తాడు ఈ శిక్ష.

అయినా లోకంలో యీ అపరాధికి యెంతో కొంత పలుకుబడి ఎందుకో!

---

# కుంపటి దిగిన కోడి సంసారం

★

'సనకసనందన'

భగవాన్ ! కుంపటి దిగిన కోడి సంసారంలాఉంది బండి దిగిన ఈయన సంసారం——అంటూ తాగుతూఉన్న కాఫీ త్వరగా పూర్తిచేసి, ప్లాటుఫారంమీదికి వచ్చి పరామర్శించాడు, నేటినుండి కాబోవు నాసాటి చిన్న మేష్టరు.

ఏమిటోయ్ ! ఇరవైయేళ్ళనుండి ఉద్యోగం చేస్తున్నావు, పెదపారియ స్టేషను ఎలాఉంటుందో నీవు తెలుసుకున్నట్లు లేదే. ఎందుకు తీసుకు వచ్చావు కుటుంబాన్ని ? వీళ్ళంతా నీపిల్లలే ? మగవాళ్లు మూడు,నాలుగు...ఐదుగురా-ఆడపిల్లలు... నలుగురా——ఆ వృద్ధు నీతల్లా: ఈమె నీ ఇల్లాలా? ఊఁ - బాగుంది. ఎక్కడ ఉంచుతావు ఈ పిల్లాజల్లా అంతా ?...అంటూ పిలుపు దూరంలోఉన్న తన ఇంటి ఇల్లాలుకు కేకవేశాడు - రెండో ఖాయం చిన్న మేష్టరు బండి దిగాడు, కాస్త టిఫిను కాఫీ నీళ్ళు పంపించు అని...

ఈ ప్రశ్నాపరంపరలకంటె వాటి నిగూఢ భావాలు నా హృదయాన్ని గుచ్చుకున్నాయి. నాలుగు దిక్కులాచూస్తే బండిదిగి వెళ్ళుతూఉన్న మూడు నాలుగు తలలు వినా ఇతర నర సంచారంగాని, ఎక్కడా కొంపా గోడీగాని కనుచూపు మేరలో కనబడదంలా. ఏం! బాబూ నాకు ఉండటానికి...అన్నాను.

అందుకే నోయి నా ఆవేద నంతా ! వీళ్ళను ఎలా కన్నావా ఎలా పెంచుతున్నావా అని కాదోయి. ఈ స్టేషు చిన్నమేష్టరీ ఉద్యోగంలో వీళ్ళందరిని ఎక్కడ ఉంచుతావా అని ? ఎదో గుడిసె వేసుకుని రాత్రి చాపవేసి బిడ్డలను పడుకోపెట్టితే, తెల్లవారు సరికి చాపఅడుగు సగం మందం ఖాళీ చెదలతో. చూస్తున్నావుగా ఆ ముళ్ళ తుప్పలు మినహాగా ఏమయినా కనపడుతున్నాయీ? వాటిలో ఉన్నయి- పురుగు, పుట్ర, చెదలు, తేళ్ళు, పాములు. అవి మన సహచరులు బయట - కాస్త ఆదమరిస్తే ఇంట్లోనూ. నీ స్వగ్రామంలో కొన్నాళ్ళపాటు కుటుంబాన్ని ఉంచలేకపోయావూ ? ఎదో ఒక గుడిసె వేసు

కున్నాక తీసుకువచ్చేవాడివిగా... నాకు పిత్రార్జితం పూజ్యం అనీ, స్వార్జితం మిగుల్చుకో గలిగింది। ఈ బిడ్డలేనని ఆయనకేం తెలుసు.

కొండయ్య బాబూ! నీ ఆదరణకు కృతజ్ఞతా వందనాలు. నేను నా బిడ్డలకు కాఫీ టిఫిను ఇచ్చే 'తెవెలు'లో లేను. మజ్జిగలో వేసిన చల్ది అన్నం తెచ్చుకున్నాము, అదే కొట్టేస్తారు అంతా. నేను ఉబ్బసపు రోగిని-నేను మాత్రం కాఫీ తాగుతా. దయచేసి బాగా వేడిగా ఒక కప్పు కాఫీ మాత్రం పంపించు - అన్నా.

ఇక వంట. తట్ట బుట్టనుంచి కుండ చట్టీ తీసి ప్లాటుఫారంమీద స్టోరు రూముకు ఆనించి, ఒక ప్రక్క ఫెన్సింగును ఆసరా చేసుకుని చిట్టికేసరి చెట్టు నీడను రెండు పొంగులు పొంగించడానికి హంగామా చేస్తూంది మా ఇంటి ఆ విడ. - ఇల్లుంటేగా ఇంటావిడ? సరే చెట్టు క్రింది ఆవిడ అంటాను. ఒక ప్రక్క ఇద్దరు ముగ్గురు పిల్లలను కబుర్లు అనే నెపంతో ఒకరిని ఒకరికి ఆనించి కూర్చోపెట్టింది. ఎడమ చేత్తో పమిటచెరగు అడ్డం పట్టుకుంది. కుడిచేత్తో ఊదుడు గొట్టం ఉఫ్- ఉఫ్ ...యుద్ధం చేస్తూంది గాలిలోని పొయ్యితో.

ఈలోగా ప్యాసింజరు వచ్చింది. ఆ బండిలోని సామాన్యులకందరికీ ఈ దృశ్యం కనపడి ఉంటుందనుకుంటాను. ఆఫీసర్లు ఎవరయినా ఉన్నట్లయితే ఆబండిలో, వారికి మట్టుకు ఇలాంటి దృశ్యాలు కంటిలో ఎక్కవు-బుర్రలో దూరవుగా.

వంట అయింది. వీపులు చూపులకు చాటుగా చేసుకుని, విస్తళ్లముందు కూర్చుంటే సగం అన్నం మెతుకులు సగం రాలిన చిట్టికేసరి ఆకులు. పప్పు పులుసులోనూ అవే. మంచినీళ్ళలోనూ అవే. అలాగే ఓపికతో ఏరి వేసుకుంటూ నేనూ బిడ్డలూ భోజనం సాగిస్తూంటే నాలుగో కుర్రవాడు, నాలుగేళ్ళవాడు ఉలిక్కిపడి లేచి గంతులువేస్తున్నాడు. స్థాయిల కందని భిన్నశ్రుతులు ఆలపిస్తున్నాడు— సంగతి కొండి భొట్లుగారి పరామర్శ...

సాయంత్ర మయింది. చలి ఆరంభమయింది. స్టేషనులోని రెండు వైపు మొద్దుగుడ్డ పట్టాలు అడ్డంగా లాగి రైలు పనివారి జీవిత నాటక రంగస్థలం నిర్మించాం.

ఇక రాత్రి వంట. వంటకు నీళ్లో? ఈ స్టేషను లోని పనివారలకు అందరకు నీళ్లిచ్చే బండి-గూడ్సు-రావాలి, నీళ్ల దొరకాలి. అంతే! అందరం కాచుకు కూర్చున్నాం. నిన్న సాయంత్రం నాలుగుగంటలకే వచ్చిందట. ఇవాళ రాత్రి పదింటికి వేంచేసింది. ఆ ఇంజనులో పట్టుకున్న నీళ్లు ఇంట్లో పోసేవానికి నెలకు పదిరూపాయిలట. ఇక్కడ మేష్టర్లు అలాగే ఇస్తున్నారు చచ్చి చెడి. ఇప్పుడు అలవెన్సులు తీసివేశారుగా ఎక్కువ జీతాలు ఇస్తున్నామని.

రాత్రి పదకొండు అయింది. కట్టినచోట దద్దు తగ్గకపోయినా, బాధ ఉన్నా, ఏడ్చిఏడ్చి పండుకున్నాడు కుర్రవెధవ. వాడికి తెలుసు కాబోలు, వయస్సు చిన్నదయినా, తండ్రియొక్క సేవా జీవిత సుఖానందంలో తాను ఎలా ఇమడవలసినది. అప్పుడు రాత్రి భోజనము. నేను రాత్రి 8 గంటలనుంచీ డ్యూటీ చేస్తున్నాను, అను కుంటూ. ప్రజను మోసుకువెళ్లే రైళ్లతో, సరుకులు రవాణా చేయు గూడ్సు బండ్లతో బంతులాట రాత్రంతా-మరునాటి ఉదయం 8 వరకు. అప్పుడు అప్పుడు నా విశ్రాంతి. ఎక్కడ? ఏ చెట్టుక్రిందో!

పండటానికి స్థలంలేదు. నిలువ నీడలేదు. త్రాగడానికి నీరులేదు. నిత్యజీవిత అవసరాలు ఏవి కావాలన్నా తొమ్మిది మైళ్లలోని నాయుడు పేట లేక పది మైళ్లలోని గూడూరు వెళ్లి తెచ్చేదెవరు? రాత్రి డ్యూటీచేసిన తరువాత విశ్రాంతి కాలం ఇలా వినియోగించడానికా? అలా చేసి విశ్రాంతి చాలక మరుసటి రాత్రి డ్యూటీలో ఒకటికి ఒకటి చేస్తే బాధ్యత ఎవరిది?

నేడు ఇక్కడి న్యాయస్థానాలలో వీడి బుర్ర ఎగిరితే ఎగరవచ్చుగాని, రేపు దేవునిఎదుట న్యాయ విచారణలో వేలాది ప్రయాణీకుల కష్టనష్టాలకు బాధ్యత వహించేది— ఈ మానవ దైహిక మానసికావసరములు 'డినై' చేయబడిన ఈ ప్రజాసేవకుడా? పోషించు ప్రజా? లేక పాలించు ప్రభుత్వమా?